సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 7 । నవంబర్ । 2024



పశుగణనతో ప్రయోజనాలెన్నో..

ఐదేళ్లకోసారి నిర్వహించే పశుగణనతో వాటికి అవసరమైన మందులు సరఫరా చేయొచ్చని అధికారులు అంటున్నారు. 10లో



అర్థమయ్యేలా బోధించాలి

విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. మిట్టగూడెం కళాశాలను ఆయన పరిశీలించారు. 10లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
31° / 21°

జిల్లాలో గురువారం ఉదయమే ఎండ ప్రభావం మొదలై మధ్యాహ్నానికి అధికం అవుతుంది. రాత్రికి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు తొలి డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

కొత్తగూడెంలో ప్రారంభించనున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్



మాట్లాడుతున్న సత్యనారాయణ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా కోర్టులో గురువారం డిజిటల్ లైబ్రరీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ప్రారంభించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ తెలిపారు. లైబ్రరీ హాల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా 91 డిజిటల్ లైబ్రరీలు నేడు ప్రారంభం అవుతున్నాయని, అందులో జిల్లాలో కొత్తగూడెం ఉందని వివరించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తోట మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.ఆర్. రవిచంద్ర, ఉప కార్యదర్శి ఎస్. ప్రవీణ్, గ్రంథాలయ కార్యదర్శి ఎండీ సాధిక్‌పాషా, క్రీడల కార్యదర్శి దూదిపాల రవికుమార్, మహిళా ప్రతినిధి నల్లమల్ల ప్రతిభ పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 19, 20 తేదీల్లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు అన్నపురెడ్డిపల్లి రెసిడెన్షియల్ స్కూల్లో నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 – 24 విద్యా సంవత్సరంలో జిల్లాలో 76 ప్రాజెక్టులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కాగా, ఒక్కో విద్యార్థికి రూ.10 వేలు వారి ఖాతాల్లో జమ చేశారని, ఎంపికైన విద్యార్థులు ఈనెల 19న జరిగే ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు హాజరు కావాలని సూచించారు. రెండు హార్డ్ కాపీలు, ఒక సాఫ్ట్ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బోనఫైడ్ సర్టిఫికెట్, ఎగ్జిబిట్‌ను తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు. పోటీలకు గైర్హాజరైన పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ సమయంలో ఏ అంశాన్ని ఎంపిక చేసుకున్నారో దానికి సంబంధించిన ప్రాజెక్టునే ప్రదర్శించాలని, ప్రాజెక్టు లేదా విద్యార్థుల పేర్లు మారిస్తే తిరస్కరణకు గురవుతాయని తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజును సంప్రదించాలని సూచించారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

అధికారులకు డీపీఓ సూచన



సర్వే ప్రక్రియను తనిఖీ చేస్తున్న డీపీఓ

చంద్రుగొండ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి అధికారులకు సూచించారు. చంద్రుగొండలో నిర్వహిస్తున్న సర్వేను బుధవారం ఆయన తనిఖీ చేశారు. వివరాల సేకరణలో తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలని ఎన్యూమరేటర్లను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ ఖాన్, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీ రాజేందర్ ఉన్నారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో సర్వే ప్రక్రియను తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంపీఓ షబ్నా, ఆర్ఐ మధు పర్యవేక్షించారు.

ఎయిమ్స్ ఏర్పాటైతేనే..

నాలుగు రాష్ట్రాల ఆదివాసీలకు మెరుగైన వైద్య సేవలు

- తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు కూడలిగా భద్రాచలం
- ఎయిమ్స్ మంజూరు చేయాలంటూ కేంద్రమంత్రికి ఎంపీ బలరామ్ వినతి
- కేఎస్‌ఎం తరహాలో ఏర్పాటుకు గిరిజనుల డిమాండ్



కాలానుగుణంగా అప్‌గ్రేడ్ కాక అంతంతగానే సేవలందిస్తున్న భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నాలుగు రాష్ట్రాల సరిహద్దు.. మావోయిస్టు ప్రభావిత ఏజెన్సీ ఏరియాలో ఉన్న భద్రాచలంలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) క్యాంపస్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఇటు సామాన్య గిరిజనుల నుంచి అటు ఎంపీల వరకూ ఉంది.

నాలుగు రాష్ట్రాల కూడలి..

భద్రాచలం పట్టణం భౌగోళికంగా కీలక స్థానంలో ఉంది. గోదావరి ఒడ్డున తెలంగాణలో కొలువైన ఈ పట్టణ పొలిమేర దాటితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వస్తుంది. భద్రాచలం నుంచి 50 కిలోమీటర్లు ప్రయాణిస్తే ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు వస్తాయి. ఇలా నాలుగు రాష్ట్రాల ఏజెన్సీ ప్రాంతాలకు కూడలిగా ఉన్న భద్రాచలానికి ఆయా రాష్ట్రాల ఆదివాసీలు చదువు, ఉపాధి వంటి అవసరాలకు ఇక్కడికే వస్తుంటారు. అంతేకాక ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా ఆకుపసరు మందు తర్వాత అత్యంత ఎక్కువగా ఆధారపడేది భద్రాచలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులపైనే అని చెప్పడం అతిశయోక్తి కాదు. అయితే ఒకప్పుడు ఏజెన్సీ ప్రజలకు గొప్పగా సేవలందించిన భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రి కాలానుగుణంగా అప్‌గ్రేడ్ కాకపోవడంతో నాలుగు రాష్ట్రాల గిరిజనులకు ఇబ్బందిగా మారింది.

బీబీనగర్‌లో ఎయిమ్స్..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణలో ఆలిండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను ఏర్పాటు చేయాలని చట్టంలో పేర్కొన్నారు. ఈ మేరకు అప్పటికే బీబీనగర్‌లో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీని ఎయిమ్స్‌గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో రాష్ట్రానికి మరో ఎయిమ్స్‌ను కేటాయించే పరిస్థితి ఇప్పుడు లేదనే వాదన కూడా ప్రభుత్వ వర్గాల నుంచి ఉంది. అయితే సామాజికంగా, భౌగోళికంగా, ఆర్థికంగా భద్రాచలంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ ఎయిమ్స్ ఏర్పాటు చేయొచ్చని నిపుణులు అంటున్నారు.

స్కూల్ ఆఫ్ మైన్స్ తరహాలో..

స్వాతంత్ర్యానికి పూర్వమే ఇల్లెందు, బెల్లంపల్లి, కొత్తగూడెంలో బొగ్గు తవ్వకాలు మొదలయ్యాయి. దీంతో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సింగరేణి ప్రధాన కార్యాలయం ఉన్న కొత్తగూడెంలో 'కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్' పేరుతో ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా మైనింగ్ కళాశాలను ప్రారంభించారు. ఆ తర్వాత 1976లో వరంగల్ కేంద్రంగా కాకతీయ యూనివర్సిటీ ఏర్పాటు కావడంతో స్కూల్ ఆఫ్ మైన్స్‌ను యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌గా పేర్కొంటూ ఉస్మానియా నుంచి కేయూకు బదిలీ చేశారు. కేవలం అప్పటి పారిశ్రామిక అవసరాల నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా 1950వ దశకంలో కొత్తగూడెంలో మైనింగ్ స్కూల్‌ను ప్రారంభించి అంచెలంచెలుగా పూర్తి స్థాయి ఇంజనీరింగ్ క్యాంపస్‌గా మార్చారు. ఇప్పుడు ఈ కాలేజీని ఏకంగా యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా మార్చాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఇదే తరహాలో యాదాద్రి జిల్లాలోని ఎయిమ్స్ – బీబీనగర్ క్యాంపస్‌కు అనుబంధంగా భద్రాచలంలో ఎయిమ్స్ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి నాలుగు రాష్ట్రాల గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఈ మేరకు స్థానిక (మహబూబాబాద్) ఎంపీ పోరిక బలరాం నాయక్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ తరుణంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు భద్రాచలంలో ఎయిమ్స్ క్యాంపస్ కోసం కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్ర సర్కారుకూ కష్టమే..

రాష్ట్ర విభజనతో భద్రాచలంలో స్థల లభ్యత తగ్గింది. 2014లో విభజన సమయంలో భద్రాచలం పంచాయతీ మినహా మండలంలోని మిగిలిన గ్రామాలన్నింటినీ ఏపీలో కలిపారు. ఇక తెలంగాణ పరిధిలో ఉన్న భద్రాచలం పట్టణం చుట్టూ స్థలం అందుబాటులో లేకుండా పోయింది. దీంతో ఇక్కడ ఆదివాసీలకు ప్రభుత్వ వైద్యం అందించాలన్నా, ఇతర రకాల మేలు చేయాలన్నా రాష్ట్రం కంటే కేంద్రానికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. పట్టణంలో ప్రస్తుతం ఉన్న 200 పడకల సామర్థ్యం గల వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో ఖాళీలను భర్తీ చేయడమే తెలంగాణ సర్కార్‌కు గగనంగా మారింది. ఈ తరుణంలో ఇక్కడి గిరిజనుల సంక్షేమం దృష్ట్యా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి చిక్కులతో కూడిన వ్యవహారంగా మారింది.

నాటుకోళ్ల పెంపకంతో ఉపాధి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



పండ్ల తోటలను పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

సుజాతనగర్ : నాటు కోళ్ల పెంపకంతో ఉపాధి పొందవచ్చని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. మండలంలోని రాఘవాపురంలో రైతు ఆకుల కృష్ణయ్య మామిడి తోటతో పాటు, నాటు కోళ్ల పెంపకాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. నాటు కోళ్ల పెంపకంలో పాటిస్తున్న జాగ్రత్తలు, ఎంత వ్యయం అయింది అనే వివరాలు ఆరా తీశారు. మామిడి తోటలో అంతర పంటగా జామ, బొప్పాయి సాగు చేస్తున్న కృష్ణయ్యను అభినందించారు. దీంతోపాటు తేనెటీగలు, నీటిగుంతల ద్వారా చేపల పెంపకం చేపట్టాలని సూచించారు. ఇలాంటి రైతులను ఆదర్శంగా తీసుకుని నాటు కోళ్లు, బాతులు, పుట్టగొడుగులు పెంచాలని మహిళా సమాఖ్య సభ్యులకు సూచించారు. అనంతరం ఆకుల రామకష్ణ అనే రైతు అంతర పంటగా వేసిన మునగ, ఆకుకూరల సాగును పరిశీలించారు. రాఘవాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్లాస్టిక్ బాటిళ్లతో తయారు చేసిన ఆకృతులను చూసిన కలెక్టర్ సిబ్బందిని అభినందించారు. ఆ తర్వాత సుజాతనగర్‌లో మల్లెల వెంకట రాంప్రసాద్ అనే రైతు సాగు చేసిన నిమ్మ, ఆపిల్, అవకాడో, బాదం, జామ, ద్రాక్ష, కొబ్బరి తదితర మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ బి.భారతి, ఏపీఎం మీరాంబీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని జిల్లా గ్రంథాలయాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందుబాటులో ఉన్న పుస్తకాలు, శాశ్వత సభ్యత్వం ఎంత వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రంథాలయంలో ఎంతో విలువైన, పురాతనమైన పుస్తకాలు ఉన్నాయని, వాటిని సరైన పద్ధతిలో భద్రపరచాలని సూచించారు. పుస్తకాలు భద్రపరిచేందుకు అల్మరాలు, శుభ్రపరచడానికి వ్యాక్యూమ్ క్లీనర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తెలంగాణ భవన్ పక్కన నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పుస్తకాలు చదివేలా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు గ్రంథాలు, నవలలు అందుబాటులో ఉంచాలన్నారు. నూతన భవనంలో పైప్‌లైన్, తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని, చదువుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు రూ.20కే భోజనం అందించేలా మహిళా సంఘాల ద్వారా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన స్వామి, జిల్లా గ్రంథాలయ అధికారి ఎం.నవీన్‌కుమార్, లైబ్రేరియన్ జి.మృదులామణి పాల్గొన్నారు.

అమెరికా ఉపాధ్యక్షుడికి పాల్వంచలో బంధువులు!



పాల్వంచలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న ఉష బంధువులు

పాల్వంచ: అమెరికాలో రిపబ్లికన్ పార్టీ అధికారంలోకి వచ్చి వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన జేడీ వాన్స్‌కు పాల్వంచలో బంధువర్గం ఉండడం విశేషం. జేడీ వాన్స్ సతీమణి చిలుకూరి ఉషది ఏపీలోని కృష్ణా జిల్లా ఉయ్యూరు. వాన్స్, ఉషల వివాహం 2014లో హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగింది. ఉష తాతల కాలం నాటి వారసులైన చిలుకూరి దినకర శాస్త్రి, పూర్ణచందర్‌రావు పాల్వంచ వాసులు. దినకర శాస్త్రి అర్చకుడు కాగా, పూర్ణచందర్ రావు ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయన కుమారులు మాధవ శ్రీకాంత్, వాసు కిరణ్ అమెరికాలో స్థిరపడ్డారు. పూర్ణచందర్‌రావు కూడా ప్రస్తుతం అమెరికాలోనే ఉన్నారు.

బ్లాస్టింగ్‌లో రక్షణ చర్యలు పాటించాలి



రక్షణ ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

మణుగూరు టౌన్: బ్లాస్టింగ్ సమయంలో రక్షణ సూత్రాలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సౌత్ సెంట్రల్ జోన్ సేఫ్టీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ ఉమేశ్ ఎం. సావర్కర్ అన్నారు. మణుగూరు ఏరియాలోని ఇల్లెందు క్లబ్‌లో అధికారులకు, సూపర్‌వైజర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిటోనేటర్ల నాణ్యత, పనితీరు బాగుందని నిర్ధారించుకున్న తర్వాతే వినియోగించాలని సూచించారు. బ్లాస్టింగ్ వద్ద విధులు నిర్వహించే ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులకు సూపర్‌వైజర్లు సరైన శిక్షణ ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ బ్రాంచి సెక్రటరీలు రాంగోపాల్, కృష్ణంరాజు మాట్లాడుతూ.. ఏరియాలో ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు కార్మికుల రక్షణ, సంక్షేమం, ఆరోగ్యంపై చర్యలు చేపట్టడం హర్షణీయమని అన్నారు. అనంతరం రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీడీఎంఎస్‌లు సనత్ కుమార్, కమలేష్‌కుమార్, ఏరియా జీఎం దుర్గం రాంచందర్, సీఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ సాయిల సురేశ్, జీఎంలు చింతల శ్రీనివాస్, తివారి, ఏరియా రక్షణాధికారి రామారావు, ముఖ్య అధికారులు శ్యాంసుందర్, ఆర్. శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వీరభద్రరావు, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- సిబ్బందికి ఎస్పీ రోహిత్‌రాజ్ సూచన
- ఐఎంఏ హాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. కొత్తగూడెంలోని ఐఎంఏ హాల్‌లో బుధవారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పోలీసు శాఖలో చేరినప్పటి నుంచి ఉద్యోగ విరమణ పొందేవరకు నిత్యం శాంతి భద్రతల పరిరక్షణకు పని చేయాల్సి వస్తుందని, ఈ క్రమంలో ఆరోగ్యాన్ని సైతం పట్టించుకోకుండా విశ్రాంతి లేని జీవితాన్ని గడపాల్సి వస్తుందని అన్నారు. అయితే నిద్రాహారాలు మాని విధులు నిర్వహించే క్రమంలో ఆ ప్రభావం ఆరోగ్యంపై పడే ప్రమయాదం ఉందని, ఈ విషయంలో సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లాలో సబ్ డివిజన్ల వారిగా పోలీసు అధికారులు ఇలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మెడికల్ క్యాంప్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు కలిపి మొత్తం 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, వైద్యులు నాగరాజు, కృష్ణప్రసాద్, రంగారావు, రాజశేఖర్, బాబురావు, ప్రవీణ్, సీఐలు కరుణాకర్, రమేష్‌కుమార్, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, ఆర్ఐలు సుధాకర్, నర్సింహారావు, లాల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జేఎంఈటీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ (జేఎంఈటీ) ఉద్యోగం సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం పరిశీలించారు. ఈ ఉద్యోగాల భర్తీకి ఆగస్టు 6, 7 తేదీల్లో ఆరు జిల్లాల్లోని 32 కేంద్రాలలో కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు నిర్వహించిన విషయం విదితమే. అందులో మెరిట్ సాధించిన వారి జాబితాను ఇటీవల విడుదల చేయగా, ప్రస్తుతం సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించారు. కాగా, తమకు సింగరేణిలో ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉందని అభ్యర్థులు తమ ఆనందాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

మద్యం డిపోలో నిలిచిన అమ్మకాలు

వైరా: ఉమ్మడి జిల్లాలోని వైన్స్, బార్లకు మద్యం సరఫరా చేసే వైరాలోని ఐఎంఎల్ డిపోలో రెండు రోజులుగా అమ్మకాలు నిలిచిపోయాయి. ఈనెల 4వ తేదిన రూ.4 కోట్ల విలువైన మద్యాన్ని షాపుల నిర్వాహకులు తీసుకెళ్లారు. ఆ తర్వాత అమ్మకాలు జరగకపోగా, డిస్టిలరీల నుంచి మద్యం తీసుకొచ్చిన వాహనాలు ఆగిపోయాయి. ఐఎంఎల్ సర్వర్ పనిచేయకపోవడంతోనే ఈ సమస్య తలెత్తిందని డిపో అధికారులు చెబుతున్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలు పెంచే ఆలోచనలో ఉండగా.. ధరలు ఖరారయ్యే వరకు డిపోల నుంచి మద్యం అమ్మకాలు ఆపాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది.

సమగ్ర సర్వే షురూ

- ముందు ఇళ్ల గుర్తింపు.. ఆ తర్వాతే సర్వే..
- 9 నుంచి ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ
- పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు
- కొత్తగూడెంలో పరిశీలించిన కలెక్టర్



కొత్తగూడెం 15వ వార్డులో సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే జిల్లాలో బుధవారం ప్రారంభమైంది. మొదటి రోజు సిబ్బంది ఇళ్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టి సర్వే స్టిక్కరింగ్ చేశారు. ఎన్యూమరేటర్లకు సర్వే చేయాల్సిన ఇళ్లను అధికారులు కేటాయించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఉదయం తరగతులు బోధించి మధ్యాహ్నం తర్వాత సర్వేలో పాల్గొన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీలోని 15వ వార్డులో సర్వే తీరును కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పరిశీలించారు. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 3,17,615 గృహాల్లో ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహిస్తారు. సర్వే పర్యవేక్షణకు ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకాధికారిని కలెక్టర్ నియమించారు. ఎన్యూమరేటర్లకు శిక్షణతో పాటు పక్కాగా వివరాలు తెలియజేసేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా ఎన్యూమరేటర్ బ్లాక్(ఈబీ)లు సిద్ధం చేసినా.. క్షేత్రస్థాయిలో పరిస్థితిపై అవగాహన అవసరమని అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో ముందుగా కుటుంబాలు.. గృహాల సంఖ్య వంటి వివరాల సేకరణకు సిద్ధమయ్యారు.

అత్యధికంగా ఉపాధ్యాయులే..

జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణకు 2,761 ఎన్యూమరేషన్ బ్లాక్(ఈబీ)లను గుర్తించారు. ఇందుకోసం 2,383 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. వీరితో పాటు పర్యవేక్షణకు 236 మంది సూపర్‌వైజర్లుగా ఎంపీడీఓలు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఎంపీఓలు, ఏఈలు ఉన్నారు. ఒక్కొక్కరికి 150 నుంచి 175 కుటుంబాలను కేటాయించారు. జిల్లాలో కుటుంబ సర్వే నిమిత్తం 2,566 మంది సిబ్బందిని తీసుకున్నారు. ఇందులో విద్యాశాఖ నుంచి అత్యధికంగా 1,856 మంది ఉపాధ్యాయులు, 85 మంది మెప్మా సిబ్బంది, పంచాయతీరాజ్ నుంచి 220 మంది, సెర్ప్ నుంచి 66 మంది, రెవెన్యూ శాఖ నుంచి 52 మంది, మున్సిపల్ నుంచి 58 మంది, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ నుంచి 167 మంది, ఇతర శాఖల నుంచి 62 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇందులో ఎక్కువ మంది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులే ఉండడంతో వారు మధ్యాహ్నం వరకు బోధన, ఆ తర్వాత సర్వే చేయాల్సి ఉంటుంది. దీంతో సర్వేలో పాల్గొంటున్న ఉపాధ్యాయులు పనిచేసే పాఠశాలలు ఒక పూట మాత్రమే నడవనున్నాయి.

మూడు రోజుల తర్వాతే..


సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లకు కేటాయించిన ప్రాంతానికి వెళ్లి ముందుగా కుటుంబాల జాబితా సిద్ధం చేయనున్నారు. ఇలా మూడురోజుల పాటు వాస్తవ పరిస్థితులపై అవగాహన వచ్చిన తర్వాత 9వ తేదీ నుంచి అసలు సర్వే ప్రారంభిస్తారు. అందులో కుటుంబాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ పరిస్థితులతో పాటు కులం వివరాలు కూడా తీసుకోనున్నారు. ఒక్కో కుటుంబానికి 8 పేజీలతో కూడిన 75 రకాల ప్రశ్నలు ఉంటాయి. 20 రోజుల్లో ఒక్కో ఎన్యూమరేటర్ తమకు కేటాయించిన ఇళ్ల సర్వే పూర్తి చేయాల్సి ఉంటుంది. జిల్లాలో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించేలా కలెక్టర్ పాటిల్.. ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. పినపాక నియోజకవర్గానికి భద్రాచలం ఆర్డీఓ కె.దామోదర్‌రావు, ఇల్లెందుకు కొత్తగూడెం ఆర్డీఓ డి.మధు, కొత్తగూడేనికి డీఎల్‌పీఓ రమణ, అశ్వారావుపేటకు జెడ్పీ సీఈఓ కె.చంద్రశేఖర్, భద్రాచలం నియోజకవర్గానికి డీఎల్‌పీఓ సుధీర్ కుమార్‌ను నియమించారు. వీరు నిత్యం సర్వే వివరాలు సేకరించి అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌కు అందజేస్తారు.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ–2008లోఅర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఖమ్మంలోని డైట్ కళాశాలలో బుధవారం ప్రారంభమైంది. డీఈఓ సోమశేఖరశర్మ, ఐటీడీఏ ఏఓ నారాయణరెడ్డి, ఏటీడబ్ల్యూఓ జహీరుద్దీన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఏజెన్సీ, మైదాన ప్రాంత అభ్యర్థులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేయగా ఏజెన్సీ అభ్యర్థుల్లో 215 మందికి 46 మంది, మైదాన ప్రాంత అభ్యర్థులు 128 మందికి 62 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖల ఉద్యోగులు చావా శ్రీనివాసరావు, ఎం. దేవేందర్, ఎర్రమల్ల శ్రీనివాసరావు, కే.వీ.మాధవరావు, రాంబాబు, కే.వీ.రామారావు, జరీనా, అనిత, జి.రమేష్, మార్క్, నారాయణరావు, అజిత, శివకుమారి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- ఎకో టూరిజం ఈడీ లక్ష్మణ్ రంజిత్‌నాయక్
- కిన్నెరసానిలో పనుల పరిశీలన



అద్దాలమేడను పరిశీలిస్తున్న లక్ష్మణ్ రంజిత్‌నాయక్

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్ అన్నారు. బుధవారం ఆయన అద్దాలమేడ, కాటేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనులు ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పాలని, ఇందుకు సంబంధించిన నివేదికలను డిసెంబర్‌లోగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. టూరిజం అభివృద్ధి పనులను ఎకో టూరిజం స్వాధీనం చేసుకుంటోందని, ఈ ప్రక్రియ త్వరలోనే అమల్లోకి వస్తుందని అన్నారు. ఇప్పటి వరకు పనులు ఏ మేరకు పూర్తి చేశారు, ఇంకా ఎంత సమయం పడుతుందనే వివరాలు ఆరా తీశారు. 90 శాతం పనులు పూర్తయ్యాయని, డిసెంబర్ నెలాఖరు నాటికి మొత్తం పూర్తిచేస్తామని అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ బి.బాబు, రేంజర్ కవిత మాధురి, ఎఫ్‌ఎస్‌ఓ సురేష్, ఎఫ్‌బీఓ రాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళా ఉద్యోగులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు బుధవారం జీఎం కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవల బదిలీ వర్కర్లుగా ఉద్యోగం పొందిన మహిళలకు 16 డిజిగ్నేషన్లు ఎంచుకోవాలని యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఏరియా ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. అధికారులు బి.శివకేశవరావు, ఎన్.యోహాన్, ఎం.పరుశురాములు, మురళి, సంఘమిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందు: సింగరేణిలో మహిళా ఉద్యోగులకు సంస్థలోని 16 కేటగిరీల్లో ఉద్యోగ స్థానాలపై బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇల్లెందులోని 24 ఏరియా ఆఫీసర్స్ క్లబ్‌లో బదిలీ వర్కర్స్, జనరల్ మజ్దూర్లుగా ఎంపికైన వారికి అవగాహన కల్పించామని ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు గిరిధర్‌రావు, మోహన్‌రావు, నర్సింహారావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఎక్కి.. అడవి మార్గంలో వెళ్లి..



ట్రాక్టర్‌లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం దట్టమైన అటవీ ప్రాంతంలో ట్రాక్టర్‌పై వెళ్లి తన దత్తత గ్రామాన్ని సందర్శించారు. అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు ఎమ్మెల్యే పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ క్రమంలో మండలంలోని గాండ్లగూడెం గ్రామం నుంచి చెన్నాపురం గ్రామానికి అడవి మార్గం గుండా వెళ్లాల్సి ఉండటంతో, గ్రామస్తులు ట్రాక్టర్ ఏర్పాటు చేశారు. దీంతో ట్రాక్టర్‌పై ప్రయాణించి చెన్నాపురం గ్రామానికి చేరుకుని అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

ముగిసిన మట్టి కట్టడాల శిక్షణ

భద్రాచలంఅర్బన్: ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో కొనసాగుతున్న మట్టితో సంప్రదాయ కట్టడాల శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రమ్మిడీ ఎర్త్ ఫౌండేషన్ సీఎస్పీ శిక్షకుడు సుధాకర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలంగా మన్నిక కలిగిన నిర్మాణాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులు, ఉద్యోగులు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, తాపీ మేస్త్రీలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, డీఈ హరీష్, ఏఈ సాలార్, ఏపీఎం హేమంతి, రైతులు, తాపీ మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కొత్తగూడెంఅర్బన్: చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఆహ్వానితులు ఎ.కస్తూరి, కె.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి, డిసెంబర్ 14,15,16 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. ప్రకటన విడుదల చేసిన వారిలో జేవీవీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.వీరభద్రం, ఎం.మోహనరావు ఉన్నారు.


నిందితుడి అరెస్టు

కొత్తగూడెంటౌన్: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసి ఘటనలో పోలీసులు బుధవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రాంపురం గ్రామానికి చెందిన పులిచర్ల రామకృష్ణ పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని రుద్రంపూర్ తిలక్‌నగర్‌కు చెందిన పార మహేందర్ ఇంటికి వచ్చి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ టీ. రమేష్‌కుమార్ తెలిపారు. దర్యాప్తు అనంతరం నిందితుడు రామకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అశ్వారావుపేటరూరల్: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. మండలంలోని అనంతారం గ్రామం వద్దగల వాగు నుంచి అనుమతులు లేకుండా అశ్వారావుపేటకు ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నారు. ఈ క్రమంలో వాగొడ్డుగూడెం వద్ద ఆర్ఐ కృష్ణ గుర్తించి పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. వాహనాన్ని సీజ్ చేసి విచారణ చేస్తున్నట్లు తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

పశు గణనతో ప్రయోజనాలెన్నో..

- గ్రామాల్లో తిరుగుతూ పశువులను లెక్కిస్తున్న సిబ్బంది
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగనున్న ప్రక్రియ
- ప్రత్యేక యాప్‌లో జీవాల సంఖ్య, జాతుల వివరాలు నమోదు



పశుగణన నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు

పాల్వంచ రూరల్: ఐదేళ్లకోసారి నిర్వహించే జాతీయ పశువుల గణన ప్రక్రియ జిల్లాలో మొదలైంది. గత నెల 25న మొదలైన ఈ ప్రక్రియ వచ్చే ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగనుంది. జిల్లాలోని తెల్ల, నల్ల పశువులు ఆవులు, గేదెలతోపాటు పలురకాలను జీవాలను పశుసంవక శాఖ అధికారులు లెక్కించనున్నారు. సర్వే పక్కాగా నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఐదేళ్లకోసారి జాతీయస్థాయిలో..

తొలిసారిగా జాతీయస్థాయిలో 1919–1920 సంవత్సరంలో పశుగణన ప్రారంభమైంది. పశువుల జీవితకాలం తక్కువగా ఉంటుంది. అదే సమయంలో పునరుత్పత్తి శక్తి కూడా అధికంగా ఉంటుంది. అందువల్ల ఐదేళ్ల కోసారి జాతీయస్థాయిలో కేంద్ర ప్రభుత్వం పశువుల గణన చేపడుతోంది. ఇప్పటివరకు 20 సార్లు పశువుల గణాంకాలు సేకరించగా, చివరిగా 2019లో నిర్వహించారు. అప్పటి లెక్కల ప్రకారం జిల్లాలో 13,58,180 పశువులు ఉన్నట్లు గుర్తించారు. గతేడాదే పశుగణన నిర్వహించాల్సి ఉండగా సిబ్బంది కొరత తదితర కారణాలతో ఆలస్యమైంది.

వివరాల సేకరణ ఇలా..

జిల్లాలోని 435 రెవెన్యూ గ్రామాలు, 484 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 106 మంది ఎన్యూమనేటర్లు 30 మంది సూపర్‌వైజర్లు తమ పరిధిలోని ప్రతి ఆవాసాన్ని సందర్శించి గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు, తదితర పశువుల సంఖ్య, జాతి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆవుల్లో జెర్సీ, ఒంగోలు, సంకర జాతి గేదెల్లో ముర్రా, గ్రేడేడ్, ముర్రా, దేశవాళీ, కోళ్లలో టర్కీ, గిరిరాజ, నాటుకోళ్లు, లేయర్, బ్రాయిలర్ జాతుల వివరాలను పొందుపరుస్తున్నారు. గ్రామాల్లో పశువైద్యాశాల, పాలసేకరణ కేంద్రం, పశుగ్రాస క్షేత్రాలు ఉన్నాయా? పశుసంపద ద్వారా ఎంత ఆదాయం లభిస్తుంది..? తదితర వివరాలను సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో జీవాల లెక్కలు...

పశువులు మొత్తం	13,58,180
తెల్ల పశువులు	2.80లక్షలు
నల్లపశువులు (గేదెలు)	1.70లక్షలు
మేకలు	2.50లక్షలు
గొర్రెలు	2.60లక్షలు
కోళ్లు	3.27లక్షలు
నాటుకోళ్లు	1.38లక్షలు
పందులు	3,180
కుక్కలు	30 వేలు

ఇవీ ఉపయోగాలు.

పశువుల గణన ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుంది. పాడి పశువులు, మేకలు, గొర్రెలకు మందులు వ్యాధి నిరోధక టీకాల సరఫరా జరుగుతుంది. అలాగే మేత, దాణా, వివరాలను తెలుసుకునే వీలుంటుంది. పశుపోషణ జీవనాధారమైన కుటుంబాలకు అందించాల్సిన సాయంపై ప్రణాళికల రూపకల్పనకు సర్వే దోహదపడుతుంది. పశుసంపద తక్కువగా ఉన్నగ్రామాల్లో వాటి సంతతిని పెంచేలా చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. పాలు అనుబంధ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం, డెయిరీల ప్రోత్సాహం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కూడా పశు గణన ఉపయోగపడుతుంది. విపత్తుల సమయంలో సురక్ష ప్రాంతాలకు పశువుల తరలింపు, అందించాల్సిన దాణా, పచ్చిమేత తదితర వివరాలు కూడా అంచనా వేసేందుకు వీలవుతుంది. జిల్లా, మండల, గ్రామాల్లో పశువుల సంఖ్యపై సంబంధిత అధికారుల వద్ద సమగ్ర వివరాలతో కూడిన జాబితా ఉంటుంది. గొర్రెలు, మేకలు, జీవాల గణంకాలతో మాంస ఉత్పత్తిపై అవగాహన కలుగుతుంది. వీధి కుక్కలు, కోళ్లు, పెంపుడు కుక్కలకు వేయాల్సిన వ్యాక్సిన్ మందులు, సంతానోత్పత్తి నివారణకు చేయాల్సిన ఆపరేషన్లపై అంచనా ఉంటుంది.

సర్వే సిబ్బందికి సహకరించాలి



జిల్లాలో 21వ జాతీయ పశుగణన ప్రక్రియను పక్కా నిర్వహించేందుకు అధికారులకు, ఎన్యూమరేటర్లకు ఆదేశాలు జారీ చేశాం. పశువుల వివరాలను యాప్‌లో నమోదు చేసేందుకు సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చాం. కచ్చితమైన సమాచార సేకరణతో పలు ప్రయోజనాలు ఉన్నాయి. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలి.

– డాక్టర్ పురంధర్, జిల్లా పశువైద్యాధికారి

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

అశ్వాపురం: గిరిజన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ల భర్తీకి బుధవారం మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలోని గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో డెమో తరగతులను నిర్వహించారు. ఈ తరగతులను ఐటీడీఏ పీఓ రాహుల్ పరిశీలించారు. దరఖాస్తుల ఆధారంగా 44 మందిని ఎంపిక చేయగా, జువాలజీ ఆరు, కామర్స్ ఏడు, తెలుగు నాలుగు, ఇంగ్లిష్ నాలుగు, కెమిస్ట్రీ రెండు, కంప్యూటర్ సైన్స్ నాలుగు, ఎకనావిక్స్ నాలుగు, హిస్టరీ రెండు పోస్టులు ఉండగా, 33 మంది డెమో తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యాపకుల బోధన పద్ధతులను పీఓ పరిశీలించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న కళాశాల భవన నిర్మాణాన్ని సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలని, సమయానుకూలంగా తరగతులు, క్రీడలు నిర్వహించాలని ఆదేశించారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన

భద్రాచలంఅర్బన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కాలేజ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ వాసవి అసోసియేషన్ యుఎస్ఏ, పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో బుధవారం మారుతి నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరానికి స్పందన లభించింది. కార్యక్రమాన్ని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ప్రారంభించి మాట్లాడుతూ అంధత్వ నివారణకు గిరిజన ప్రాంతంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించటం అభినందనీయమని అన్నారు. పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. 1120 మంది కంటి పరీక్షలు నిర్వహించి, 602 మందిని 15 బ్యాచ్‌లకు కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. 320 మందిని కళ్లజోళ్లు ఇచ్చేందుకు ఎంపిక చేశారు. మందులు అందజేశారు. అందరికీ మధుమేహం, బీపీ పరీక్షలు కూడా చేశారు. ఆపరేషన్ చేయాల్సిన మొదటి బ్యాచ్ 40 మందిని హైదరాబాద్‌లోని పుష్పగిరి ఆస్పత్రికి వ్యాన్‌లో తీసుకెళ్లగా, వాహనాన్ని భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు జెండా ఊపి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, వైద్యాధికారులు రవిబాబు, రామకృష్ణ, డాక్టర్ ఆర్.నారాయణ, భద్రాచలం ఎంపీఐ వెంకటపుల్లయ్య, ఎస్ఆర్ వాసవి అసోసియేషన్ అధ్యక్షుడు పందిరి శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ రమేష్ బాపనపల్లి, శ్రీరామ్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి ఎదురుచూపులు

- ఇటీవల తుమ్మల చెరువును సందర్శించిన కలెక్టర్ జితేష్
- పర్యాటకాభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశాలు



తుమ్మలచెరువు కట్టపై అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ వరప్రసాద్

అశ్వాపురం: మండలంలో ప్రధాన సాగునీటి వనరైన కాకతీయుల కాలంలో నిర్మించిన తుమ్మలచెరువు పర్యాటక అభివృద్ధి కోసం స్థానికులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలోనే తుమ్మలచెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు చేశారు. కానీ ప్రభుత్వాలు, పాలకులు మారినా అభివృద్ధిని ఎవరూ పట్టించుకోలేదు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలు తుమ్మలచెరువుకు తరలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మొర్లెపాడు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసినా పనులకు మోక్షం కలగడం లేదు. ఇప్పటికైనా ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలకు కలెక్టర్ ఆదేశం

ఇటీవల తుమ్మలచెరువును కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సందర్శించారు. ఇక్కడ పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. తుమ్మలచెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బోటింగ్, రహదారి నిర్మాణం, క్యాంటీన్ నిర్మాణం, కట్ట అభివృద్ధిపై ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. దీంతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఎంపీడీఓ వరప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు తుమ్మలచెరువును సందర్శించి బోటింగ్ ఏర్పాటుకు, వసతులకు సంబంధించి స్థలాలు పరిశీలించారు. తుమ్మలచెరువు పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనలకే పరిమితం కాకుండా అమలుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చెరువు వరకు రాకపోకలకు రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి

తుమ్మలచెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల సందర్శించిన ఆయన చెరువు వద్ద రెండు బోట్ల ఏర్పాటుకు ఆదేశించారు. డ్వాక్రా గ్రూపు మహిళలతో బోటింగ్, పర్యాటకులకు వసతులు కల్పించేలా చర్యలు చేపడుతున్నాం.

– వరప్రసాద్, ఎంపీడీఓ, అశ్వాపురం.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థిని మైత్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సునీత

ములకలపల్లి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని గొడ్ల మైత్రీ జాతీయస్థాయి అండర్ – 17 కబడ్డీ పోటీలకు ఎంపికైంది. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ సునీత వివరాలు వెల్లడించారు. ములకలపల్లికి చెందిన గొడ్ల లావణ్య–రంగారావు దంపతుల కూతురు మైత్రీ గురుకులంలో పదో తరగతి చదువుతోంది. మహబూబ్‌నగర్‌లో జిల్లాలో ఇటీవల జరిగిన అండర్–17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయజట్టులో స్థానం దక్కించుకుంది. ఈ నెల 16 నుంచి 20 వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో నిర్వహించనున్న పోటీలకు హాజరుకానుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పీఈటీ సుజాత, పీడీ సారిక, ఉపాధ్యాయులు అభినందించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

దమ్మపేట: మండల పరిధిలోని దమ్మపేట, నాచారం, గండుగులపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కులగణన సర్వే పరిశీలన

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన ప్రక్రియను మండలంలోని గుర్వాయిగూడెం గ్రామంలో అదనపు కలెక్టరు పరిశీలించారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, సమగ్ర వివరాలు సేకరించాలని చెప్పారు. తహసీల్దార్ నరేష్, ఏఓ చంద్రశేఖరరెడ్డి, ప్రభుత్వ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

బంగారు ఆభరణాలు, మోటర్ సైకిళ్లు చోరీ



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వినయ్‌కుమార్

పాల్వంచ: అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసినట్లు బుధవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. సీఐ వినయ్ కుమార్ కథనం ప్రకారం... ఈ నెల 5న పాల్వంచ నవభారత్ ఏరియా జగ్గతండా క్రాస్‌రోడ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టిన క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా అతడు మహబుబాబాద్ జిల్లా కురవి మండలం బలపాలకు చెందిన మాలోతు రూప్లాల్ అలియాస్ లాలు అలియాస్ సాయి అని, ప్రస్తుతం కొత్తగూడెం హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉంటున్నట్లు తేలింది. ఇతను మందా కల్యాణి అనే మహిళతో కలిసి గత ఆగస్టులో పాల్వంచ సీతారాంపట్నం ఏరియాలో ఓ ఇంటి తాళం పగుల గొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. అశ్వాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో, మహబుబాబాద్ జిల్లా కురవి స్టేషన్ పరిధిలో బంగారు, వెండి ఆభరణాలు, మహబుబాబాద్ రూరల్ స్టేషన్ పరిధిలోని కంబాలపల్లి ఏరియాలో, బూర్గంపాడు పీఎస్ పరిధిలో, పాల్వంచ ఇందిరా నగర్ కాలనీలో మూడు బైక్‌లు, చుంచుపల్లి పీఎస్, తల్లాడ పీఎస్ పరిధిలో రెండు ఇళ్లలో నగదు చోరీ చేసినట్లు విచారణలో అంగీకరించాడు. నిందితుడి నుంచి 8 తులాల బంగారు నగలు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇతనిపై గతంలోను అనేక కేసులు ఉండగా జైలుకు వెళ్లాడని, ఇతనితో కలిసి చోరీలకు పాల్పడిన మహిళ కల్యాణిని వారం రోజుల క్రితం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. పట్టణ ఎస్ఐ సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

కేటీసీలో 16 మేకలు మృతి



మృతి చెందిన మేకలతో ఆందోళన చేస్తున్న బాధితులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టు ఎల్ఎస్ఎన్ క్యాంపు సమీపంలో మేతకు వెళ్లిన 16 మేకలు బుధవారం మృతి చెందాయి. దీంతో బాధిత రైతు, లచ్చగూడెం గ్రామానికి చెందిన జబ్బా వెంకటేశ్వర్లు, మరికొందరు కలిసి ఆందోళనకు దిగారు. వీరికి కాంగ్రెస్ నాయకుడు కె.సురేందర్, బీఆర్ఎస్ నాయకుడు ఎల్.సురేందర్‌రావు, న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ నాయకుడు డి. ప్రసాద్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం కూడా కేటీసీలో నాలుగు మేకలు, రెండు ఆవులు చనిపోయాయని, కలుషిత నీటి వల్లనే ఇలా జరుగుతోందని ఆరోపించారు. సీఐ సురేష్, బోడు ఎస్ఐ పి.శ్రీకాంత్ అక్కడకు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. పశు వైద్యాధికారికి సమాచారం ఇవ్వగా, ఆయన వచ్చి మృతి చెందిన మేకలను పోస్టుమార్టానికి తరలించారు. కాగా కలుషిత నీటి వల్ల మేకలు చనిపోయాయని తేలితే చర్యలు తీసుకుంటామని ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, జీఎం పర్సనల్ మోహన్‌రావు, సెక్యూరిటీ ఆఫీసర్ అంజిరెడ్డి తెలిపారు. అనంతరం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు అందజేశాడు.

అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్ ఇన్‌స్పెక్టర్ జితేందర్



మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ జితేందర్

కొత్తగూడెంటౌన్: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ అన్నారు. బుధవారం చుంచుపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని జిల్లా సైబర్ క్రైమ్స్ కోఆర్డినేషన్ సెంటర్‌లో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. మోసపూరిత ఆన్‌లైన్ లింకులను ఓపెన్ చేయొద్దని కోరారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే తక్షణమే సైబర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, సింగరేణి ఎంప్లాయిస్ అసోసియేషన్, తెలంగాణ సీనియర్ సిటిజన్స్ సంఘాలకు చెందిన దాదాపు 100 మంది పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసులు, జాగిలం

టేకులపల్లి: మండలంలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్‌ను కనిపెట్టేందుకు బుధవారం పోలీసులు జాగిలంతో తనిఖీలు నిర్వహించారు. పాత గంజాయి నేరస్తుల నివాసాల్లో, ప్రధాన కూడళ్లు, నిర్మానుష్య ప్రదేశాల్లో సీఐ తాటిపాముల సురేష్, ఎస్ఐ పోగుల సురేష్, జాగిలం హ్యాండ్లర్ వెంకటేశ్ ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. గంజాయి , మాదకద్రవ్యాలు అమ్మినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

దుమ్ముగూడెం : మండలంలోని ఆర్లగూడెం గ్రామ సమీపంలో బుధవారం టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై నుంచి జారి పడి ఓ మహిళ మృతి చెందింది. దుమ్ముగూడెం గ్రామానికి చెందిన కుప్పిలి రాజేశ్వరి (30) చేపలను విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ క్రమంలో చేపలను విక్రయించేందుకు వాహనంపై వెనుక కూర్చుని వెళ్తుండగా, ఆర్లగూడెం సమీపంలో అదుపుతప్పి వాహనం పై నుంచి జారిపడింది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 ద్వారా భద్రాచలం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతదేహాన్ని భద్రాచలం ఏరియా వైద్యశాలలో భద్రపరిచారు.

చికిత్స పొందుతున్న వివాహిత..



రాజేశ్వరి(ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని పోచారంతండా గ్రామపంచాయతీ అమర్‌సింగ్‌తండా గ్రామానికి చెందిన వివాహిత గుగులోత్ కావ్య (26) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. కొమరారం ఎస్సై సోమేశ్వర్ కథనం ప్రకారం.. కుటుంబంలో తరచూ చోటుచేసుకుంటున్న కలహాలతో మనస్తాపం చెంది గత నెల 1న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మంలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. భర్త బిందాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

బూర్గంపాడు: మండల పరిధిలోని టేకులచెరువు గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యంపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 3న లక్ష్మీపురం వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. బంధుమిత్రుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ రాజేష్ తెలిపారు.

భద్రాద్రి రామయ్యకు కవచాలు బహూకరణ



స్వామివారికి సమర్పించిన కవచాలు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి బంగారం పూతతో కూడిన రాగి కవచాలను భక్తుడు అందజేశారని ఆలయ ఈఓ బి.రమాదేవి తెలిపారు. ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన సత్యనారాయమూర్తి – వెంకటరత్నశ్రీ దంపతులు గతంలో స్వామిని దర్శించుకున్న సమయాన ఏమైనా సమర్పించాలనే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారన్నారు. ఈ మేరకు అర్చకుల సూచనలతో రాగితో చేయించి బంగారు పూత, రత్నాలతో పొదిగిన రూ.3.10 లక్షల విలువైన కవచాలు, ఆయుధాలను సమర్పించారని తెలిపారు. ఈ కవచాలను ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం సమయాన అలంకరించనున్నట్లు ఈఓ వెల్లడించారు.

- **భద్రాచలంఅర్బన్:** శ్రీ సీతారామచంద్ర స్వామికి విజయవాడలోని మాచవరానికి చెందిన భాస్కరం బంగారపు ముత్యాల దండతో పాటు గొలుసు అందజేశారు. వీటి విలువ రూ.1.39లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించనున్నట్లు ఈఓ బి.రమాదేవి తెలిపారు. ఉదయం 10 గంటలకు లెక్కింపు మొదలవుతుందని, ఆలయ ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, భక్తులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఐటీడీఏ రోడ్డులో ఉన్న సిరి ట్రావెల్స్ నిర్వహిస్తున్న వ్యక్తి అకారణంగా భద్రాచలం గ్రామ పంచాయతీ సూపర్‌వైజర్ కాపుల రవిపై దాడి చేశాడు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు ట్రావెల్స్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పీవీఎన్ రావు తెలలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ మా వద్ద BA. లో తెలుగు, హిందీ Lit కొరకు ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పి.జి. & MBA, B.Tech, LLB, ITI, డిప్లమా, ఫార్మసీ, B.Sc (Agri) B.Ed, B.P.Ed. అ.కై. సంప్ర॥ 9948131154 [YA-1145757]



■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253908]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ18k Ph: 9160900024, 9640400073 [sca-24000547]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం : 9705444182, 9010299957

కొత్తగూడెం : 9010223783

పాల్వంచ : 9705444183